18082024-DIS-08_Layout 1 8/18/2024 4:45 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నిన్న సాగు విప్లవం.. నేడు సావు సంకటం

వర్ధెల్లి వెంకటేశ్వర్లు

వెనుకటికెవరో... పంచ పాండవులు నాకు తెల్వదా.. మంచం కోళ్ల తీరు ముగ్గురే కదా అని రెండు చూపించి, ఒకటి రాయబోయి సున్నా సుట్టిండట! నా చిన్నప్పుడు మా హైస్కూల్ తెలుగు మాష్టారు తూపురాణి లక్ష్మణాచారి సార్ చెప్పేవారు. సార్ అప్పట్లో ఏ సందర్భంలో చెప్పారో నాకు గుర్తులేదు కానీ, ఇప్పుడు రైతు రుణమాఫీకి అచ్చు గుద్దినట్టు సరిపోయింది.

రూ.2 లక్షల పంట రుణాల హామీతో కాంగ్రెస్ పార్టీ కొలువు మీదికొచ్చింది. రేవంత్ రెడ్డి కూటమెక్కి పంట రుణమాఫి రూ.40 వేల కోట్లని లెక్కలేసి, 'ఇదెంత పని ఏడాది పాటు కడుపు గట్టుకుంటే తీసి అవతల పారేత్తం' అని చెప్పి రూ.31 వేల కోట్లుగా నిర్ధారించి, బడ్జెట్‌లో 26 వేల కోట్లు పెట్టి, 17.9 వేల కోట్లే ఇచ్చి, పేద రైతులకు సున్నా సుట్టి తొడగొడుతున్నడు. ఇక రాజీనామా చెయ్ హరీష్‌రావు అని సవాల్ జేస్తున్నడు.

సంపూర్ణ రైతు రుణమాఫీ చేసినట్టు నిరూపిస్తే..! నేను సిద్ధమే అంటుండ్రు కేటీఆర్, హరీష్ రావు. నా నియోజకవర్గమో.. నీ నియోజకవర్గమో.. చెప్పు లెక్కలు తేలుద్దాం అంటున్నరు. ఇప్పటివరకు దొరికిన లెక్కల ప్రకారం ముఖ్యమంత్రి సొంతూరు కొండారెడ్డిపల్లి. ఆ ఊరు కల్వకుర్తి సహకార సంఘం బ్యాంక్ పరిధిలోకి వస్తుంది. ఈ బ్యాంకులో 1,407 మంది రైతులకు పంట రుణాలుంటే 2వ విడత నాటికి ఒక్కరికీ రుణ మాఫీ కాలేదు. మూడో విడత లబ్ధిదారులను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. ఇటువంటి ఉదాహరణలు రాష్ట్రవ్యాప్తంగా లెక్కకు మించి ఉన్నాయి. బ్యాంకర్ల నివేదికల ప్రకారం.. ఇంకా 14.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వీళ్లంతా వ్యవసాయాధికారుల సుట్టూ తిరుగుతున్నరు. రోడ్ల మీదికి వస్తున్నరు. బ్యాంకుల ముందు ఆందోళన చేస్తున్నరు. రాజకీయ సవాళ్లు, ప్రతిసవాళ్లు ఎట్లా ఉన్నా... పెసరి చేలో పోగొట్టుకొని కూరటికల దేవులాడుకున్నట్టు ఉంది తెలంగాణ రైతాంగం అవస్థ. ఎవడు విసిరిన పాచికో.. ఏ కొనుగోళ్ల మాయలో పడ్డమో, ఏమో! మార్పు కావాలి.. మార్పు కావాలి అని పాలిచ్చే బర్రెను కాళ్ల తన్నుకున్నం. బతుకును బజాట్లె వేసుకున్నం.

ఈ నేపథ్యంలో ఓ సందర్భం గుర్తుకువస్తున్నది. 'నా వయస్సు ఇప్పుడు 64 ఏండ్లు. తెలంగాణ కావాలనుకున్నా.. తెచ్చినా. ఈ కీర్తే నాకు వెయ్యి జన్మల పుణ్యఫలం. కొట్లాడి తెచ్చుకున్నం. ఈన గాసి నక్కల పాలు కావద్దు. అది బంగారు తున్క గావాలె. కర్షకుని కన్నీళ్ల తుడిచే రైతురాజ్యం అవ్వాలె. అది రామరాజ్యంగా మారాలె. దుఃఖం లేని రైతు ముఖం చూడాలన్న ఆకాంక్ష తప్ప, నాకు ఎవరితో పంచాయితీ లేదు. కొట్లాట లేదు.' తెలంగాణ రాష్ట్ర సమితి 17వ ఆవిర్భావం వేళ ఓరుగల్లు వేదిక నుంచి కేసీఆర్ ఉద్వేగంగా ప్రసంగించారు.

వరంగల్ రైతుహిత సభ అనంతరం రాష్ట్రంలో సాగు విప్లవం వచ్చింది. మిషన్ కాకతీయ నీళ్లు పంట పొలాలకు అందినయి. దీనికితోడు కేసీఆర్ 2018లో పంట రుణాలకు లబ్ధిదారుల సంఖ్య పెంచారు. 36.68 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రుణ మాఫీ కోసమే రూ.19,198 కోట్లు ఖర్చుచేశారు. రైతుహిత సభ జరిగిన మరుసటి ఏడాదే.. అంటే, 2018లో రైతుబంధు పెట్టిండు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రైతుబంధుకు రూ.12 వేల కోట్ల బడ్జెట్‌ను పెట్టిండు. ఈ లెక్క కేసీఆర్ దిగిపోయేనాటికి రూ.64,940 కోట్లకు చేరుకున్నది. రైతులను అప్పుల భారం నుంచి విముక్తం చేస్తూ.. మళ్లీ అప్పుల ఊబిలో కూరుకుపోకుండా చేయాలన్న లక్ష్యంతో కేసీఆర్ రైతుబంధు పథకం తెచ్చిండు. రైతుబంధును కాంగ్రెస్ పార్టీ బద్నాం చేస్తూ వచ్చింది. కలిగినోళ్లకు కూడా రైతుబంధు పడుతుందనే విమర్శ చేస్తూ వచ్చింది. ఈ విమర్శ సన్న, చిన్నకారు రైతులను ఆకర్షించింది. అదే సమయంలో రాజకీయ వ్యూహకర్తల ముసుగులో బ్రోకర్లు పల్లెల్లోకి చొరబడ్డరు. ప్రత్యర్థి రాజకీయ పార్టీతో వేల కోట్ల రూపాయల ఒప్పందాలు చేసుకున్నరు. సోషల్‌మీడియా వేదికగా విషం చిమ్మిండ్రు. తెలంగాణ ఓటరును ఏమార్చిండ్రు. బ్రోకర్ల మాయలో సగటు ఓటరు దగా పడ్డడు.

> **బ్యాంకర్ల నివేదికల ప్రకారం.. ఇంకా 14.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వీళ్లంతా వ్యవసాయాధికారుల సుట్టూ తిరుగుతున్నరు. రోడ్ల మీదికి వస్తున్నరు. బ్యాంకుల ముందు ఆందోళన చేస్తున్నరు. రాజకీయ సవాళ్లు, ప్రతిసవాళ్లు ఎట్లా ఉన్నా... పెసరి చేలో పోగొట్టుకొని కూరటికల దేవులాడుకున్నట్టు ఉంది తెలంగాణ రైతాంగం అవస్థ.**

కాంగ్రెస్ వచ్చీరావటంతోనే కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టింది. 24 గంటల నిరంతర కరెంటును పండబెట్టింది. రైతుబంధు బందైంది. రైతు రుణమాఫీ ఎక్కిరిస్తున్నది. 14.5 లక్షల మంది రైతులను పక్కనపడేసి సంపూర్ణ రుణమాఫీ చేసినమని గప్పాలు కొట్టుకుంటున్నరు. కేసీఆర్ రూ.ఒక లక్ష రుణమాఫీనే 36 లక్షల మంది రైతులకు ఇస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీకి కేవలం 22.37 లక్షల మందే అని చెప్పటం మోసం కాదా? సర్కారు చేతిలో మోసపోయిన రైతాంగం దిక్కుతోచక మళ్లీ ఆత్మహత్యల వైపు మొగ్గితే, ఆ ఉసురు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే తాకుతుంది. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పంటచేను కాడి కాపలాదారుడై సాగు విప్లవం తీసుకొస్తే... మలి ప్రభుత్వం పంటను సావు సంకటంగా మారుస్తున్నది.

రాజకీయ అరాచకత్వం

కె.లక్ష్మణ్‌గౌడ్
97049 30509

గత వైభవం ఎంతో గాని ప్రస్తుత రాజకీయ కాలుష్యం అవధుల్లేని దురాగతాల పాలై విలవిల్లాడుతున్నది. పరనింద-ఆత్మస్తుతి పరాకాష్ఠకు చేరి సత్యమేదో, అసత్యమేదో సామాన్యుడు గ్రహించజాలని దుర్దశ రాజకీయాల్లో దాపురించింది.

చట్టసభల్లో, సామాజిక మాధ్యమాల్లో, విభిన్న ఛానెళ్లలో ఎడతెరిపి లేని చర్చలు, విశ్లేషణలు ఆయా రాజకీయ పార్టీలకు తొత్తులుగా సాగుతాయే కానీ, సార్వజనీన సత్యాలు గాలికి వదిలివేస్తున్నాయి. సత్యదూరమైన విష ప్రచారాలకు బానిసలై కాలాతీతమైన ప్రజాభ్యుదయాన్ని పరిగణనలోకి తీసుకోలేకపోతున్నాయి.

> **దశాబ్దకాలంగా ఉప్పెనై ఉప్పొంగిన అభ్యుదయాన్ని అపహాస్యం చేస్తూ పదవీలాలసత పొందుతున్నారు రాజకీయ నాయకులు. ప్రజా సంక్షేమంతో ముడిపడ్డ ప్రజా ప్రభుత్వాలు ప్రణాళికా రచనల్లో ప్రజాభ్యుదయ రాజకీయాలకు అంకితమై జనరంజకంగా సాగవలసిన పరిపాలన ప్రజా కంటకంగా మారితే దిక్కెవరు?**

రాజ్యాంగబద్ధ ప్రమాణాలు, న్యాయవ్యవస్థ స్థిరీకరించిన సత్సాంప్రదాయాలు నేలమట్టమై కేవలం వ్యక్తిగత రాజ్యమేలే దుష్ట సంప్రదాయాలకు చట్టసభలు నిలయాలైతే సంస్కరించేదెవరు? ఒక స్థాయిలో ఉన్న ప్రజా నాయకులే ఉచ్చరించ వీలుకాని పద ప్రయోగాలకు చట్టసభలు వేదికలా? తర్కం ఎక్కడైతే విఫలమౌతుందో అక్కడ భౌతిక దాడి దాపురిస్తుంది. (Physical force comes into exforce where the logic fails) గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ అహంభావం, అరాచకం రాజ్యమేలిందంటూ మేధావులు ప్రచారాస్త్రాలను సంధిస్తున్నారు. కానీ, జాతీయ, అంతర్జాతీయ అధికార నివేదికలు దశాబ్దకాలంగా తెలంగాణ రాష్ట్ర ప్రగతిని వేనోళ్ల ప్రశంసిస్తూ ప్రకటించిన వివరాలు ఈ కండ్లున్న కబోదులకు కనిపించడం లేదా?

సమాజ శ్రేయస్సు కాంక్షించే మేధావివర్గం నిర్లిప్తంగా, నిద్రాణంగా గత ప్రభుత్వాన్ని కూలదోయడంలో క్రియాశీలక పాత్ర పోషించింది. కానీ, నేటి దుస్థితిని ఎందుకు ప్రతిఘటించలేకపోతున్నది? సమాజ సంరక్షకులుగా కీర్తించబడుతున్న మేధావులు తమ పాత్ర బలంగా పోషిస్తూ ఈ దారుణాలను నివారించే ప్రయత్నం చేయాలి. చట్టసభల్లో చేసే వాదాలు-వివాదాలపై పోస్ట్‌మార్టం చేయగల మేధోసంపత్తి గల చింతనాపరులు వారు తమ ఏకాంతానికే పరిమితమైన మేధో పరిమళాలతో ప్రస్తుత రాజకీయ కాలుష్యాన్ని నివారించడంలో మార్గ నిర్దేశనం చేయాలి. అప్పుడే పరిస్థితిలో మార్పు గణనీయంగా రాగలదు.

సిద్దిపేట అంటేనే పోరాటాల గడ్డ. ఎన్నో ఉద్యమాలు ఆ మట్టిలోనే పురుడుపోసుకున్నాయి. పద్నాలుగేండ్ల పాటు కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో ముందుండి నడిచిన సిద్దిపేట, ఆ తర్వాత పదేండ్ల ప్రగతిపథంలోనూ అందరికీ ఆదర్శంగా నిలిచింది. అలాంటి సిద్దిపేట గడ్డ కాంగ్రెస్ కుతంత్రాలకు, డైవర్షన్ రాజకీయాలకు వేదికగా మారడం గమనార్హం.

దాడులతో నిజాలను దాచలేరు!

చిటుకుల మైసారెడ్డి
94905 24724

అబద్ధపు హామీలతో అందలమెక్కిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకైనా తన తీరును మార్చుకోవడం లేదు. దుష్ప్రచారాలు చేస్తూ అభూత కల్పనలను సృష్టిస్తున్నది. ఇంకా చెప్పాలంటే.. అధికార పీఠమెక్కాక ఆ పార్టీ ఆగడాలకు అడ్డే లేకుండాపోయింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చేయనట్టు, పూర్తికానటువంటి రుణమాఫీ పూర్తయినట్టు ప్రచారం చేయడమే అందుకు నిదర్శనం.

రాజకీయాల్లో విమర్శలు-ప్రతివిమర్శలు, ఆరోపణలు-ప్రత్యారోపణలు, సవాళ్లు-ప్రతిసవాళ్లు సహజం. కానీ, అవి కాస్త హద్దు మీరితేనే అసలు సమస్య. రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్, మాజీ మంత్రి హరీశ్‌రావు చేసుకున్న సవాల్ గురించి తెలిసిందే. ఇచ్చిన మాటను నిలబెట్టుకోని కాంగ్రెస్ సర్కార్ సిద్దిపేటలో దాడులకు తెగబడుతూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నది. ఓ దిక్కు రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్ పోరాడుతుంటే.. ఇంకో దిక్కు హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నానా హంగామా చేస్తున్నది. ఆ పార్టీ నాయకులు ఏకంగా సిద్దిపేట ఎమ్మెల్యే కార్యాలయంపై దాడిచేసి చర్చను పక్కదోవ పట్టించారు. దీనంతటి వెనుక ఎవరున్నారో ప్రజలకు తెలుసు.

ఒకేసారి రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. 22 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేసిన కాంగ్రెస్ సర్కార్ సుమారు 60 శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టింది. రూ.17 వేల కోట్ల రుణాలనే మాఫీ చేసినట్టు సీఎం రేవంత్ చెప్పుండటమే అందుకు నిదర్శనం.

హరీష్‌రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయడం హాస్యాస్పదం. పంద్రాగస్టులోపు రైతులందరి రుణాలను మాఫీ చేయాలని, ఆరు గ్యారంటీలను అమలుచేయాలని ఆయన సవాల్ చేశారు. ఇప్పటికీ ఆ మాట మీదే నిలబడ్డారు. చెప్పింది చేయలేకపోయిన కాంగ్రెస్ నేతలే మాట తప్పి ప్రభుత్వ ఆస్తులపై దాడులకు పాల్పడుతున్నారు. అసలు హరీశ్‌రావు సవాలు చేసిన అంశాన్ని పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. వాటిలో ముఖ్యమైన రుణమాఫీ అసలు పూర్తికాలేదు. ఇక, ఆరు గ్యారంటీలను వేరే చెప్పనక్కర్లేదు.

తమ నిర్వాకంతో రైతుల ఆగ్రహానికి గురికాకతప్పదని గ్రహించిన కాంగ్రెస్ దాడులను ప్రోత్సహిస్తున్నది. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై శుక్రవారం అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడటం శోచనీయం. కార్యాలయం ధ్వంసం అవుతుండగా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. ఈ ఘటన వెనుక కాంగ్రెస్ రాష్ట్ర నేతల హస్తం ఉన్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నది. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నాయకులపై నిందారోపణలు చేస్తూ దాడులకు ఉసిగొల్పుతున్నది. ఈ నేపథ్యంలోనే సిద్దిపేట క్యాంప్ కార్యాలయంపై దాడి జరిగింది. ఇది రాష్ట్ర చరిత్రలో మాయని మచ్చ.

రుణమాఫీ విషయమై ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు నిలదీస్తుంటే కాంగ్రెస్ సర్కార్‌కు మింగుడు పడటం లేదు. ప్రతీ రైతు రుణాన్ని మాఫీ చేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన 8 నెలలకు గాని రుణమాఫీ ప్రక్రియ చేపట్టలేదు. అది కూడా కొర్రీలు పెట్టి, కోతలు కోశారు. క్యాబినెట్ సమావేశంలో రూ.31 వేల కోట్లు, బడ్జెట్ సమయంలో రూ.26 వేల కోట్లు అని చెప్పిన రేవంత్.. చివరాఖరికి రూ.17 వేల కోట్ల రుణాలనే మాఫీ చేశారు. 45 లక్షల నుంచి 22 లక్షలకు లబ్ధిదారుల సంఖ్యను పరిమితం చేశారు. ఇంకా సగం మంది రుణాలు మాఫీ కాలేదు. ఈ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ బాణం ఎక్కుపెట్టింది. రైతుల పక్షాన నిలిచింది. కేటీఆర్, హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, నాయకులు ఊపిరాడకుండా చేస్తుండటంతో కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడిపోయింది. అందుకే బీఆర్ఎస్ నేతలపై దాడులకు దిగుతున్నది. అధికార పార్టీ నాయకులే ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేస్తుంటే బాధితులను ఎవరు కాపాడాలి? ప్రజల ఆస్తులను ఎవరు రక్షించాలి? ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. వీటిని ప్రజాస్వామికవాదులు ఖండించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రే బాధ్యత తీసుకోవాలి.

ఒకవేళ హరీశ్‌రావు రాజీనామా చేస్తే.. ఆయనను మళ్లీ అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు సిద్దిపేట ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కానీ, బీఆర్ఎస్ బీఫామ్‌తో గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి పోటీలోకి దింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని ఈ సందర్భంగా నేను ప్రశ్నిస్తున్నా? సదరు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీ రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్తే ప్రజలు ఎవరిపక్షాన ఉన్నరనే విషయం తేలిపోతుంది. అంతేకానీ, చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులపై దాడులకు పాల్పడుతామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. కాంగ్రెస్ పార్టీకి తగినరీతిలో బుద్ధి చెపారు.



రాజకీయం చేస్తున్న బీజేపీ!

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళన చేస్తున్నారు. కానీ, బీజేపీ మాత్రం ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్నది. ఆ ఘటన గురించి పదే పదే మాట్లాడుతున్న బీజేపీ నేతలు.. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇంటికి సమీపంలో ఓ దళిత మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయాన్ని మాత్రం ఎక్కడా ప్రస్తావించడం లేదు.

- అఖిలేశ్ యాదవ్, యూపీ మాజీ సీఎం

ముందు రిజర్వేషన్లు ఆ తర్వాతే ఎన్నికలు!

తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి గారికి బహిరంగ లేఖ

విషయం: కులగణన చేపట్టడం గురించి.

గౌరవనీయులైన రేవంత్‌రెడ్డి గారికి నమస్కారం..

బీసీలు అధికారానికి, అవకాశాలకు, అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడిన కులాలుగానే మిగిలిపోతున్నారు. దురదృష్టవశాత్తు ఆధిపత్య వర్గాల పార్టీలు ఎప్పుడూ బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి తప్ప ఏనాడూ వారికి తగినంత ప్రాతినిధ్యం కల్పించడం లేదు. పార్టీలు తమ అధికార, ధన, కుల బలాన్ని ఉపయోగించి బీసీలను ఓటర్లుగానే పరిగణిస్తున్నాయి. ఒకరిద్దరికి అవకాశాలు కల్పించి మొత్తం బీసీల కోసమే ప్రభుత్వం పనిచేస్తున్నట్టు భ్రమలు కల్పిస్తున్నారు.

1961 జనాభా లెక్కల ప్రకారమే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఇక బీసీ రిజర్వేషన్లు రాష్ట్రానికో రకంగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇస్తుంటే.. బీసీలకు మాత్రం జనాభాలో సగం నిష్పత్తికే ఇస్తున్నారు. మండల్ కమిషన్ ప్రకారం.. దేశంలో బీసీలు 52 శాతం ఉండగా.. రిజర్వేషన్లు మాత్రం 27 శాతమే అమలవుతున్నాయి. ఇక ఓసీల జనాభా చాలా తక్కువ ఉన్నప్పటికీ ఏ సర్వే లేకుండానే నేరుగా ఎస్టీల కంటే ఎక్కువగా 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ఎస్సీ, ఎస్టీలకే రిజర్వేషన్లు అమలవుతున్నాయి. తమకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

> **తెలంగాణలో బీసీలు 60 శాతానికి పైగా ఉంటారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో కలిపితే 93 శాతం ఉంటారు. ప్రజాస్వామ్యంలో మెజారిటీ వర్గాలదే రాజ్యాధికారం. అంటే ఈ లెక్కన 60 శాతం ఉన్న బీసీలకే రాజ్యాధికారం దక్కాలి కదా! దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. కానీ, ఉమ్మడి ఏపీ నుంచి ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్క బీసీ వ్యక్తి కూడా ముఖ్యమంత్రి కాలేదు. రాజ్యాంగం కల్పించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయానికి రాజకీయ పార్టీలు కట్టుబడటం లేదు. రాజకీయ నాయకుల మాటలకు, చేతలకు ఏ మాత్రం పొంతన ఉండదు.**

2022లో ఉదయ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో మీ (కాంగ్రెస్) పార్టీ కులగణనకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపట్టి సామాజిక న్యాయం చేస్తామని భారత్ జోడో యాత్రలో మీ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు. అలాగే మీరు కూడా కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను పెంచుతామని కూడా హామీ ఇచ్చారు. అంతేకాదు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో పాటు బీసీ సబ్‌ప్లాన్‌ను తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే తెస్తామన్నారు. అంతేకాకుండా, బీసీల అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని వాగ్దానం చేశారు. ప్రతి జిల్లాలో బీసీ భవన్‌తో పాటు రుణాలు, మండలానికో బీసీ గురుకులం ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు.

సాక్షాత్తూ అసెంబ్లీ సాక్షిగా మీరు చెప్పిన మాటలను మీకు గుర్తుచేస్తున్నాను. 'బలహీనవర్గాలను బలోపేతం చేయడమే మా ఉద్దేశం. ఇంతకాలం పాలితులుగా ఉన్నవారిని రాబోయే రోజుల్లో పాలకులుగా తయారు చేయడమే మా లక్ష్యం. కులగణన చేపట్టి రాజకీయ ప్రాధాన్యంతో పాటు జనాభాకు తగ్గట్టుగా అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం' అని మీరు హామీ ఇచ్చారు. మీ హామీలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయే తప్ప అమల్లోకి రావడం లేదు.

ఈ సందర్భంగా మీకో విషయం గుర్తుచేయదలుచుకున్నాను. 2021లో జనగణనలో బీసీల కులగణన కూడా చేయాలని నాటి సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. 'సమాజంలోని పేదవర్గాల సముద్ధరణను దృష్టిలో ఉంచుకొని, నిరుపేదలకు లబ్ధి చేకూర్చడం కోసం వివిధ సంక్షేమ చర్యలు చేపట్టడానికి కచ్చితమైన గణాంకాలు నిర్వహించాల్సి ఉన్నది. సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పౌరులకు సంబంధించి రాజ్యాంగంలోని సెక్షన్ 15 రూల్ 4, 5, సెక్షన్ 16 రూల్ 4, సెక్షన్ 243 (టీ) రూల్ 6 మేరకు 2021 సాధారణ జనాభా లెక్కలను నిర్వహించేటప్పుడు కులాలవారీగా వెనుకబడిన తరగతుల జనాభా లెక్కలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ శాసనసభ కోరుతున్నది' అని తీర్మాన పత్రాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో చదివి వినిపించారు.

చివరిగా మిమ్మల్ని నేను కోరుతున్నది ఒక్కటే. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీ మేరకు మీ ప్రభుత్వం తక్షణమే సమగ్ర కులగణన చేపట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నా. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీల వాటా ఎంతో తేల్చాలి. బీసీ డిక్లరేషన్ పేరిట ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన మీరు ఇచ్చిన హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే దాదాపు 24 వేల మంది బీసీలు అదనంగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా మారుతారు. ఈ నేపథ్యంలో కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నా.

అలాగే బీసీల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి 2024-25 పద్దులో రూ.9,200 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని బట్టి చూస్తే.. మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమవుతున్నది. మీరు ఇచ్చిన హామీ మేరకు బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని, ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నా. ఇలాగే మీరు కాలయాపన చేస్తే ఏ బీసీలైతే మిమ్మల్ని అధికార పీఠంపై కూర్చోబెట్టారో అదే బీసీలు గద్దె దింపడం ఖాయం.

బూడిద బిక్షమయ్య గౌడ్
బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే